క్లుప్తంగా

డయేరియాపై అవగాహన ర్యాలీ



దెందులూరులో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: ప్రతి ఒక్కరూ వైద్య సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏఎన్ఎంలు సూచించారు. గురువారం దెందులూరులో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు ఫ్లెక్సీలు చేతపట్టి అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కాచిచల్లార్చిన నీరు తాగాలని, విధిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: మండలంలోని పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం దెందులూరు మండల పాస్టర్లు విలియం రత్నప్రసాద్, మోహన్‌పాల్ చైతన్య, డానియేల్, కరుణాకట్, ప్రాణహిత్‌లు ఎమ్మెల్యేను కలిశారు. సమస్యలు తెలియచేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్

పెదపాడు: ఎరువుల దుకాణాల్లో రైతులకు కల్తీ లేని నాణ్యమైన ఎరువులు మాత్రమే అందించాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. గురువారం పెదపాడు మండలంలోని అప్పనవీడులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా రిజిష్టర్లు, బిల్ బుక్స్, నిల్వలు చెక్ చేశారు. దీంతోపాటు డీసీఎంఎస్ అప్పనవీడులో ఎరువుల నిల్వలు గమనించి, 3 రకాల రసాయన ఎరువుల శాంపిల్స్‌ను తిరుపతిలోని ల్యాబ్‌కు నాణ్యత పరీక్ష నిమిత్తం పంపించామన్నారు. రిపోర్టులను అనుసరించి కల్తీ ఉంటే డీలర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ కార్యదర్శి భాస్కరరావు వీఏఏలు నాగరాజు, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శం



భీమడోలులో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమడోలు: స్వామి వివేకానందుడి జీవితం నేటి యువతకు ఆదర్శ ప్రాయమని భీమడోలు వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు మద్దాల అప్పారావు అన్నారు. భీమడోలులో వివేకానంద యూత్ ఆధ్యక్షుడు సుతాపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానందుడి 122వ వర్ధంతి నిర్వహించారు. గ్రామంలోని వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వివేకానందుడి సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో సంఘం యువకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

భీమడోలు: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేసిన ఆయన రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.సునీతను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి

కుక్కునూరు: గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని కుక్కునూరు తహసీల్దార్ పి అచ్యుతా కుమారి సూచించారు. గురువారం గోదావరి వరదలపై ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో శానిటేషన్ కార్యక్రమాలను నిర్వహించే దిశగా బ్లీచింగ్ పౌడర్‌ను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓకు సూచించారు. మెడికల్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మండలానికి మరో 108 వెహికల్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు



దెందులూరు నర్సింగ్ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



పెదపాడు మండలంలోని అప్పనవీడు, పెదపాడు గ్రామాల్లో అల్లూరి జయంతి వేడుకలు

దెందులూరు : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం నర్సింగ్ కళాశాలలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం పోరాడి కేవలం 27 సంవత్సరాలు వయసులోనే ప్రాణాలర్పించిన అల్లూరి పోరాటం ఎప్పటికి స్ఫూర్తిదాయకమన్నారు. మన్యం వాసుల కష్టాలను కడతెర్చడానికి తెల్లదొరల దోపిడీ ఎదుర్కొవడానికి గిరిజనులకు అండగా నిలిచిపోరాడిన గొప్ప యోధుడు అల్లూరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెదపాడులో..

పెదపాడు: మండలంలోని పెదపాడు, అప్పనవీడు గ్రామాల్లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అప్పనవీడులో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో అల్లూరి 127వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు తదనంతరం బహుమతులు అందించారు. ప్రతీ భారతీయుడు గర్వించదగిన వ్యక్తి అనికొనియాడారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.మధుసూధనరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురం ఎంజీజీ కాలేజీలో అల్లూరి జయంతి

ఉంగుటూరు: అల్లూరి సీతారామరాజు యువతకు స్ఫూర్తిగా నిలుస్తారని నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ అన్నారు. గురువారం నారాయణపురం కాలేజీలో అల్లూరి సీతారామరాజు 127 వజయంతి ఉత్సవాలు నిర్వహించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన సేవా నిరతిని అధ్యాపకులు, విద్యార్థులు కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గణపవరంలో అల్లూరి విగ్రహానికి పూల మాల వేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సోమరాజు

నేటి యువతకు స్ఫూర్తి అల్లూరి

గణపవరం: విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకుని అవినీతి, అక్రమాలపై పోరాడాలని వైఎస్సార్ సీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడింపల్లి సోమరాజు అన్నారు. గురువారం అల్లూరి జయంతి సందర్భంగా జగన్నాథపురంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన అల్లూరి విగ్రహాన్ని పార్లమెంట్‌లో ప్రతిష్ఠించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేగేశ్న సుబ్బరాజు, వేగేశ్న శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. అల్లూరి జయంతి వేడుకలు వాడవాడలా నిర్వహించారు. గణపవరం మారెమ్మ గుడి సెంటర్‌లో అల్లూరి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడలో క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాశిపాడులో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి సందర్భంగా క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, క్షత్రియ యూత్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

డయేరియా రహిత సమాజానికి కృషి చేయాలి



పోలసానిపల్లిలో గ్రామకార్యదర్శికి సూచనలందిస్తున్న ఈవోఆర్‌డీ సుందరి

భీమడోలు: డయేరియా రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమడోలు ఈవోపీఆర్‌డీ ఎ.సుందరి అన్నారు. భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లో గురువారం స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లతో కలిసి ఆమె పర్యటించారు. అనంతరం భీమడోలులో స్టాప్ డయేరియా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ ప్రక్రియతోపాటు డ్రెయిన్ల పూడిక తీయించారు. డయేరియా సోకకుండా సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధను పాటించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు జాన్, మేకా హేమసుందర్, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఉంగుటూరు: కైకరంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో తాడేపల్లిగూడెం అర్జున్ ఆసుపత్రి, ఏలూరు కంటి ఆసుపత్రి వైద్యులు సేవలందిస్తారని తెలిపారు. శిబిరాన్ని ఎమ్మెల్యే పత్సమట్లధర్మరాజు ప్రారంభిస్తారన్నారు. గైనకాలజీ, ఎముకలు, కళ్లు, స్త్రీల వైద్య నిపుణులు వైద్య సేవలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు.

ఊపందుకున్న సార్వా పనులు



సానిగూడెంలో దుక్కి దున్నుతున్న దృశ్యం



దెందులూరులో నారు చేరవేస్తున్న దృశ్యం

దెందులూరు: వర్షాలు కురవడంతో మండలంలోని ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. చాలా గ్రామాల్లో ముందస్తు వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో వరి నాట్లకు ఉపక్రమించారు. ఇప్పటికే నారుమడులు వేయడం పూర్తయింది. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సమృద్ధిగా నీరు ఉండటం దీనికితోడు వర్షాలు సైతం రావడం రైతులకు సాగు పనులకు తోడ్పాటు లభించింది. ట్రాక్టర్‌తో దుక్కిదున్నటం, నారులు వేయడం ఇతర ప్రాంతాల నుంచి నారు తీసుకురావడం, ఊడ్పులు ప్రారంభించడం జరుగుతుంది. పనులు ప్రారంభించిన మొదటివారమంతా వర్షాలు రావడం సాగు పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ కూలీలు అక్కడి వ్యవసాయ పనులతో బిజీగా ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: మండలంలో సోమవరప్పాడు పరిధిలో 11 కేవీ కరెంటు లైన్లు మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించడానికి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదలచేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ అధికారి జేపీవీ నటరాజన్ తెలిపారు. విద్యుత్‌శాఖ సిబ్బందికి సోమవరప్పాడు పరిధిలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెదపాడులో..

పెదపాడు : మండలంలోని వట్లూరు, పెదపాడు, కొక్కిరపాడు గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీవీ నటరాజన్ తెలిపారు. పెదపాడు సెక్షన్ పరిధిలోగల కలపర్రులోని 33/11కేవీ సబ్‌స్టేషన్, 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు. దీంతో కలపర్రు, కొక్కిరపాడు, వేంపాడు, వట్లూరు రాఘవ ఎస్టేట్, ఇంద్రప్రస్థ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని నటరాజన్ చెప్పారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండ

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించిన కానిస్టేబుల్ దాసరి మధుకుమార్ కుటుంబానికి పోలీస్ సిబ్బంది అండగా నిలిచారు. కానిస్టేబుల్ మధుకుమార్‌తో పాటు పోలీస్ శాఖలో అడుగు పెట్టిన 2013 బ్యాచ్ పోలీస్ సిబ్బంది తమవంతుగా చేయి చేయి కలిపి రూ.2.47 లక్షలను సేకరించి ఆయన కుటుంబానికి గురువారం అందజేశారు. తమతోపాటు ఎంతో ఉత్సాహంగా పనిచేసే కానిస్టేబుల్ మధుకుమార్ అనారోగ్యంతో మృతి చెందడంఎంతో బాధించిందని పోలీస్ సిబ్బంది వాపోయారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సీఐ బోనం ఆదిప్రసాద్ ఉన్నారు.

వంగవీటి రంగా పేదల పెన్నిధి



విజయరాయిలో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



వంగవీటి రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: దివంగత వంగవీటి రంగ పేదల పెన్నిధని, ఆయన ఆశయాలు గొప్పవని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం వంగవీటి రంగ జయంతిని కైకరం సెంటర్లో రంగ విగ్రహం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. చేబ్రోలు నుంచి కై కరం వరకు ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలోజనసేననాయకులు వంగా రఘు, వెజ్జు సుబ్బారావు ,పాత్తూరి వాసు, ఆర్యవైశ్యసంఘం రాష్ట్ర నాయకుడు కోన శ్రీను, కమ్ముల త్రిమూర్తులు, కాపు సంఘం నాయకులు పుప్పాల గోపి, ఉప సర్పంచి మట్టమురళి, వంగవీటి రంగా యూత్ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

భీమడోలు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా ఆశయ సాధనలో యువత భాగస్వామ్యులు కావాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో గురువారం స్వర్గీయ వంగవీటి మోహనరంగా 77వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, కాపు యువత, తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి మోహనరంగా

దెందులూరు: పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి అభ్యున్నత వంగవీటి మోహనరంగారావు ఎంతో కృషి చేశారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం విజయరాయి గ్రామంలో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా, నాయకుడిగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పిప్పరలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కృష్ణా జిల్లాకు రంగా పేరును పెట్టాలి

గణపవరం: పేదల అభ్యున్నతికి నిరంతరం పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన వంగవీటి మోహనరంగా పేదల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నారని పలువురు వక్తలు తెలిపారు. గురువారం రంగా జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు రంగా సేవలను కొనియాడారు. మండలంలోని పలు గ్రామాల్లో రంగా జయంతి వేడుకలు నిర్వహించారు. బువ్వనపల్లిలో రంగా జయంతి సందర్భంగా యువకులు కేక్ కట్ చేసి వేడులు నిర్వహించారు. పాఠశాలల్లో పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం అందజేత



గోపన్నపాలెం పాఠశాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

దెందులూరు: గోపన్నపాలెం గ్రామంలో ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి, ఎన్ఆర్ఐ గోపిమురళీ తాను చదువుకున్న పాఠశాలకు త్రీఫేజ్ కరెంటు నిమిత్తం రూ. 15 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మరీదు మనోహర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ సిబ్బందికి రూ. 15 వేలు నగదును అందజేశారు. తాను విద్యనభ్యసించిన పాఠశాలకు తనవంతు సాయం అందించాలనే దృక్పథంతో త్రీఫేజ్ కరెంటు ఏర్పాటుకు నగదు ఇవ్వడం జరిగిందని గోపన్నపాలెం ఉన్నత పాఠశాల మరింత అభివృద్ధి చెందాలని, విద్యార్థులందరూ ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. దాత, పూర్వపు విద్యార్థిని హెచ్ఎం మనోహర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో చింతా సుబ్బారావు, కొండేటి హనుమంతు, ఏనుగు శ్రీనివాసరావు, బీ. గణేష్, మరగాని సత్యనారాయణ, శింగలూరి నర్సయ్య, ఏనుగు అచ్చారావు, రామకృష్ణ, జోజి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ప్రక్షాళన పనులు ప్రారంభం



డ్రైనేజీ ప్రక్షాళన పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: డ్రేనేజీ ప్రక్షాళన పనులు ప్రారంభించి, ఊరచెరువు ముంపు నుంచి తప్పిస్తామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం గొల్లగూడెం ఊరచెరువు గట్టు పటిష్ఠం చేయడం, ముంపుకు గురవుతున్న డ్రైనేజీలపై ప్రక్షాళన పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వలన వచ్చే వరదల కారణంగా పరిసరాలు ముంపునకు గురవకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీలో తూడు తొలగించాలని అధికారులను ధర్మరాజు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి కరపా శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

గొల్లగూడెం గంటా వేణు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ధర్మరాజు పరామర్శించారు. అలాగే బొల్లిన చిన్నతల్లి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను ధర్మరాజు పరామర్శించారు.

ప్రత్యేక హోదాకు కృషి చేయాలి

చింతలపూడి: రాష్ట్రానికి ప్రత్యేక హోదాకై కూటమి నేతలు ప్రయత్నించాలని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అన్నారు. రేచర్ల గ్రామ శాఖ సమావేశం దొంత తిరుపతయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కంచర్ల గురవయ్య మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికై రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి నిర్మాణానికి, పోలవరం నిర్మాణానికి నిధులు తీసుకురావడానికి ప్రయత్నించాలన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



బాలికల వసతి గృహంలోని విద్యార్థినితో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినుల ఆరోగ్యం పట్ల సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన సూచించారు.రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో వారు స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు స్టోర్ రూమ్, వంటశాల, పరిసరాల శుభ్రతపైన మరింత దృష్టి సారించాలని, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, డీఎల్ఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలి



పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఘంటసాల స్వరపీఠం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత జాతీయ పతాక రూపశిల్పి, తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి పింగళి వెంకయ్యకు భారత అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న ప్రకటించాలని జాతీయ జెండా ప్రచార కార్యకర్త, ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపకుడు ఎస్ఎం సుభానీ డిమాండ్ చేశారు. మువ్వన్నెల జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఘంటసాల స్వరపీఠం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ ఈటి అర్జున రావు మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని రూపొందించిన వ్యక్తి పింగళి వెంకయ్య తెలుగువారు కావడంతోనే ఆయనకు దక్కాల్సిన గుర్తింపు, గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పింగళి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని, ఆయన జయంతి రోజును జాతీయ సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సుభానీ మాట్లాడుతూ పింగళి వర్ధంతి రోజున తమ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ పతాకాలు తయారీ మొదలు పెట్టామని, వీటిని మూడు సైజుల్లో అందిస్తామన్నారు. వాటిలో రన్ పతాకం, వందన పతాకం, హర్ ఘర్ తిరంగా పతాకం అనే మూడు సైజులు ఉంటాయన్నారు. పతాకాల తయారీ అనంతరం మాజీ ప్రధాని నెహ్రూ పార్లమెంట్‌లో పతాకాన్ని ప్రవేశపెట్టిన రోజైన జూలై 22 నాటికి పతాకాలు ప్యాక్ చేసి ఆగస్టు 2న పింగళి జయంతి రోజు స్కూల్స్‌కి, కాలేజీలకి, ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

నగరేశ్వర స్వామి ప్రసాద కైంకర్యానికి విరాళం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ జనార్ధన, శ్రీ నగరేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ నగరేశ్వర స్వామి వారికి ప్రతి సోమవారం స్వామివారి ప్రసాద కైంకర్యం నిమిత్తం శ్రీ నగరేశ్వర భక్త బృందం ప్రతినిధులు రూ. 1,01,116లు విరాళంగా సమర్పించారు. గురువారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావుకు ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును శ్రీ నగరేశ్వర భక్త బృందం ప్రతినిధులు తోట కిషోర్, పడవల శేషు ప్రసాద్, రెడ్డి కృష్ణ తాడిపర్ల రమేష్‌లు అందజేశారు. భక్తులు సమర్పించిన మొత్తానికి ఈఓ పెద్దింట్ల రావు వారికి బాండ్‌ను అందజేశారు. స్వామి వారి పూజా కైంకర్యాల నిమిత్తం భక్తులు విరివిగా విరాళాలు సమర్పించాలని ఈఓ కోరారు.

శివయ్యకు రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం శివదేవునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు.

జూలై 10 వరకు డిగ్రీ అడ్మిషన్లు

ఉంగుటూరు: ఈనెల 10 లోపు డిగ్రీలో చేరే విద్యార్థులు ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15 వరకు వెబ్ వెరిఫికేషన్ చేస్తామని తెలిపారు. 19న సీట్లు కేటాయిస్తామన్నారు. 22 నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, పీజీలో ఎంకామ్ జనరల్ కోర్సులు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.